జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 16-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 702 పేజీలు: 4 వెల : రూ.7







# మాయగాళ్లతో.. జర జాగ్రత్త!

* వ్యాపారుల వద్దకు భార్యభర్తలమంటూ వస్తారు * డబ్బులు అవసరం.. బంగారం తీసుకోండని నమ్మబలుకుతారు * తక్కువ ధరకే ఇస్తామని.. ఆశ చూపుతారు * మాయమాటలతో వ్యాపారులను టోకరా వేసి.. చేతికందిన సొమ్ముతో పరార్ * బంగారాన్ని పోలిన నకిలీ బంగారం అండగడతారు * రాజాంలో ఆరు లక్షలు, పొందూరులో లక్షా 30వేలతో ఉడాయింపు * విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల రెండు ఘటనలు * మోసపోయామంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యాపారులు



శ్రీకాకుళం క్రైం, జూన్ 15 (వార్త):
ఓ దుకాణం వద్దకు ఒక జంట వచ్చింది. తాము భార్యభర్తలమని.. తమకు డబ్బులు అత్యవసరమని, తక్కువ ధరకే బంగారం అమ్మేస్తామని ఆ వ్యాపారికి నమ్మించారు. బంగారు నాణ్యతను పరిశీలించిన తర్వాతే డబ్బులు ఇవ్వాలని నమ్మబలికారు. బంగారాన్ని చూపించారు. తక్కువ ధరకే బంగారం వస్తుందని ఆశ పడిన ఆ వ్యాపారి వారికి కొంతమొత్తం ఇచ్చాడు.. మిగతా మొత్తం తర్వాత రోజు ఇస్తానని చెప్పడంతో.. సరేనంటూ వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత రోజు ఆ దంపతులు రాలేదు. ఆ వ్యాపారికి అనుమానం వచ్చి బంగారు వస్తువును తనిఖీ చేయించగా, అది నకిలీదిగా తేలింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. తాను మోసపోయాయని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటువంటి ఘటనలు విజయనగరం జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. ఈనెల 11న విజయనగరం జిల్లాలోని రాజాంలో, 13వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు మండలంలోని కోటిపల్లిలో జరిగింది. ఇదే జంట రాజాం పట్టణంలో నకిలీ బంగారాన్ని అంటగట్టి రూ.6లక్షలు కాజేయగా, పొందూరు మండలంలోని కోటిపల్లిలో రూ.1.30లక్షలకు ఓ వ్యక్తికి టోకరా వేశారు. బంగారం ధర ఆకాశాన్ని అంటడంతో మోసాలు జోరందుకుంటున్నాయి. నిత్యం సామాజిక మాధ్యమాల్లో మోసపోయిన బాధితులు వెల్లబుచ్చుతున్న తీరు వెలుగులోకి వస్తున్నా ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు అత్యశకు పోయి బలైపోతున్నారు. నకిలీ బంగారాన్ని అమ్మేవారు సైతం బంగారం షాపులకు కాకుండా ఫ్యాన్సీ, తదితర షాపులకు వెలుతుంటారు. బంగారం వర్తకులైతే తేలికగా పసిగట్టేస్తారన్న అనుమానంతోనే వీరు ఆ షాపులకు వెళ్లడం లేదు. మరో విషయమేమిటంటే ముందుగా వారు ఒక పథకం ప్రకారం ఓ షాపునకు వెళ్లి అసలు బంగారాన్ని తక్కువ గ్రాములతో ఉన్న బంగారాన్ని తీసుకువెళతారు. అది క్వాలిటీ బంగారం అయివుంటుంది. దాన్ని తక్కువ ధరకే అమ్మి వ్యాపారి వద్ద నమ్మకంగా ఉంటారు. తమకు అవసరమైతే డబ్బులు ఇవ్వాలని, బంగారం తెచ్చి ఇస్తామని ఆశ చూపుతారు. దీంతో వ్యాపారులు సైతం తక్కువకు వస్తుంది కదా అని సరేనని చెబుతున్నారు. కొద్ది రోజులు పోయిన తర్వాత టోకరా గాళ్లు నకిలీ బంగారంతో వెళ్లి వ్యాపారికి అంటగట్టి వారి వద్ద పెద్ద మొత్తం డబ్బులు తీసుకుని పరారీ అవుతున్నారు. ఇంకో విషయమేమిటంటే వీరు ఈ నకిలీ బంగారాన్ని ఏ బ్యాంకుల్లో కూడా కుదవ పెట్టరు. బ్యాంకు అధికారులైతే బంగారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి డబ్బులు ఇస్తారు. వీరి బండారం బయట పడుతుందేమోనని ఈ మోసగాళ్లు బ్యాంకుల్లో కాకుండా వ్యాపారులకే విక్రయించి మోసగిస్తున్నారు. జిల్లావాసులు తస్మాత్ జాగ్రత్త.




# వేట ప్రారంభం

* సముద్రంలో చేపల వేట నిషేధం ముగిసింది * వేటకు బయలుదేరిన మత్స్యకారులు * ఇంకా చాలా మందికి అందని మత్స్యకారులకు భృతి

సంతబొమ్మాళి, జూన్ 15 (వార్త): చేపలవేటకు ప్రభుత్వం గత నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేటను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర మత్స్య శాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సంతానోత్పత్తి సీజన్ కావడంతో 61 రోజుల పాటు వేటను సర్కార్ నిషేధించింది. దీంతో బోట్లు తీరానికి చేరుకోగా, మత్స్యకారులు వలలు, బోట్లు బాగుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎట్టకేలకు 61రోజుల తర్వాత నిషేధం ఎత్తివేయడంతో మళ్లీ మత్స్యకారులు సంద్రంలోకి వేటకు బయలుదేరారు. జిల్లాలో 11 మండలాల్లో 193 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. సముద్రమే జీవనాధారంగా వందల కుటుంబాలు జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. సముద్రంలో చేపల వేట నిషేధ కాలం ఆదివారం అర్ధరాత్రితో ముగియడంతో సోమవారం ఉదయం నుంచి మళ్లీ యథావిధిగా చేపల వేటకు బయలుదేరారు. రెండు నెలలు పాటు పనిలేక ఖాళీగానే ఉన్నామని, వేట నిషేధం ఎత్తివేయడంతో వేటకు బయలుదేరి వెళుతున్నామని మత్స్యకారులు చెబుతున్నారు. కాగా, వేట లేని సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార సేవలో భాగంగా అర్హులైన మత్స్యకారులకు రూ.20వేలు చొప్పున మత్స్యకార భృతిని అందజేసింది. శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 11 మండలాల్లో 16,737 మందిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఇంకా చాలామందికి నగదు వారి ఖాతాల్లో జమకాలేదు. దీంతో మత్స్యకారులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ ఖాతాల్లో ఇంకా నగదు పడలేదని అర్జీలు సైతం ఇస్తున్నారు. తమకు మత్స్యకార భృతి ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

# మీకోసం.. సైకిల్‌పై..!

* కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జడ్పీ కార్యాలయం వరకూ సైకిల్‌పైనే పయనం * పర్యావరణ పరిరక్షణ, ఫిట్‌నెస్ పై సరికొత్త సందేశం

శ్రీకాకుళం, జూన్15 (వార్త): పర్యావరణ పరిరక్షణ, శారీరక దారుఢ్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌లు సరికొత్త సందేశాన్ని జిల్లా ప్రజలకు అందజేశారు. ఆరోగ్యం, పర్యావరణం కోసం సైకిల్ తొక్కాలని కలెక్టర్, జేసీలు చెప్పడమే గాకుండా వారు ఆచరణలో చేసి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక' కార్యక్రమానికి సైకిల్‌పై విచ్చేశారు. అక్కడ ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత అధికారులిద్దరూ తిరిగి తమ తమ క్యాంపు కార్యాలయాలకు సైకిల్ పైనే ప్రయాణమయ్యారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు, ఇంధన పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతోనే జిల్లా ఉన్నతాధికారులు ఇలా సైకిల్ పై ప్రయాణించడం విశేషం. కలెక్టర్, జేసీలు సైకిల్‌పై వస్తున్నా కొందరు అధికారులు మాత్రం తమ తమ ప్రభుత్వ వాహనాలపైనే వస్తుండడం గమనార్హం.



## ట్రిపుల్ ఐటీలో మఖరజోల విద్యార్థిని నవ్యశ్రీ ప్రతిభ

**- నూజివీడు క్యాంపస్‌కు ఎంపిక**

**మందస, జూన్ 15(వార్త):** ట్రిపుల్ ఐటీలో మందస మండలంలోని మఖరజోల విద్యార్థిని తమ్మినాన నవ్యశ్రీ ప్రతిభ చూపింది. గతంలో మాక్ అసెంబ్లీలో పలాస ఎంఎల్ఏగా అద్భుత ప్రదర్శనకు 'నవ్యశ్రీ' ప్రతిభకు సీఎం నారా చంద్రబాబునాయుడు, రాష్ట్రమంత్రి నారా లోకేష్ అభినందించారు. తల్లిదండ్రులు వృత్తిరీత్యా టైలర్స్. తల్లిదండ్రులు తమ్మినాన నాగేశ్వరరావు, హరిప్రియ దంపతులు తమ కుమార్తెను కాశీబుగ్గలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివించారు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండే నవ్యశ్రీ 10వ తరగతిలో మంచి మార్కులు సంపాదించి, ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యింది.

ఆంధ్రప్రదేశ్ లోని నూజివీడు క్యాంపస్ కు ట్రిపుల్ ఐటీ చేయనుంది. నవ్యశ్రీ విజయం పట్ల మఖరజోల గ్రామస్తులు, విద్యావేత్తలు, స్థానికులు అభినందనలు తెలిపారు.



## బీఎల్‌ఏలకు సర్‌పై అవగాహన



**జి.సిగడాం, జూన్ 15(వార్త):** ఓటర్ నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి కచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితా తయారీకి బీఎల్‌ఏలు సహకరించాలని వీఆర్వో భూపతి నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి అల్లాడ దుర్గారావు కోరారు. సోమవారం మండల పరిధి పెంట, తదితర గ్రామాల సచివాలయాల్లో సంబంధిత అధికారులు బీఎల్‌ఏలతో ఓటర్లపై సదస్సు బూత్ స్థాయి ఏజెంట్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ 2002 ఓటరు జాబితాను ఆధారం చేసుకుని ఈ నెల 15 నుంచి జులై 14 వరకు బీఎల్వోలు ఇంటింటికి వచ్చి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారన్నారు. పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి బీఎల్ఎలు సహకరించాలని కోరారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అత్యంత కీలకమైనదని ఇంటింటి సర్వే రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభం ప్రారంభమైందని. జులై 14 వరకూ నెల రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వో) ఇంటింటికీ వస్తామన్నారు.ప్రతి ఓటరుకూ రెండు ఎన్యుమరేషన్ ఫాంలు ఇస్తారు. వాటిలో ఓటరు పేరు, ఫొటో గుర్తింపుకార్డు సంబరు, చిరు నామా వివరాలతో పాటు ఓటరు పాత ఫొటో ముద్రించి ఉంటాయి. మిగతా వివరాలను ఓటరు నింపాలి. అందుకు బీఎల్ వోలు సహకరిస్తారు. పూర్తిచేసిన ఫాంలను బీఎల్వోలే వచ్చి తీసుకుం టారు. ఈ నెల రోజుల్లో ఎన్యుమరేషన్ ఫాంలు ఇవ్వడానికి, నింపినవాటిని తిరిగి తీసుకోవడానికి మూడుసార్లు బీఎల్ వోలు ప్రతి ఇంటికీ వస్తారు. సర్వే పూర్తి అయ్యాక ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి ఆగస్టు 20 వరకూ క్లెయిమ్లు, అభ్యం తరాలపై దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటరుగా చేరాలంటే ఫాం-6లో, చిరునామా మార్పునకు ఫాం-8లో, మృతులు, అనర్హుల పేర్లు తొలగింపునకు ఫాం-7లో దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబరు 18 వరకూ వాటిని పరిశీలించి, అర్హతలు ఉంటే తుది జాబితాలో పేరు చేరుస్తారు. అనర్హులుగా తేలితే తొలగిస్తారు. సెప్టెంబరు 22న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారు.

## ఘనంగా గోపి జన్మదిన వేడుకలు




**పలాస, జూన్ 15 (వార్త):** ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గోపి జన్మదిన వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. గోపికి పలువురు జన్మదిన వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరమణ (చిట్టి), వైసిపి నాయకులు ఉంగసాయి కృష్ణ, మాజీ ఎంపీపీ బత్తిన కహేమేశ్వరరావు, కోర్రాయి గోపి, బమ్మిడి సంతోష్, యుళ్ల సంతోష్, వైసీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



**పలాస, జూన్ 15 (వార్త):** పలాస మండలంలోని లొద్దబద్ర గ్రామంలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మహిళా సాధికారత (నారీ శక్తి), నూతన చట్టాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, నగరం, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ఆన్‌లైన్ లావాదేవీలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త పంథాలు కనిపెడుతున్నారని, 2025లో సైబర్ నేరాలు 24% పెరిగి, భారతీయులు ?22,495 కోట్లకు పైగా కోల్పోయారని తెలిపారు. గ్రామంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పండుగలు, ఉత్సవాలు నిర్వహించే సమయంలో ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటుసారా అక్రమ రవాణా, విక్రయాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నివారణ, మహిళలపై జరిగే నేరాల అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో 112 సేవల వినియోగం వంటి అంశాలపై గ్రామస్తులకు సూచనలు చేశారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ నరసింహమూర్తి కోరారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి ప్రత్యేక అలంకరణ



**ఇచ్ఛాపురం, జూన్ 15 (వార్త):** అధిక జేష్ఠ మాసం సోమవారం మిధున సంక్రమణం సందర్భంగా ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి గుడిమార్గంలో ఉన్న అయ్యప్ప స్వామి పంచాయతన దేవాలయంలో స్వామివారికి వేకువజామున పంచామృతాలతో అభిషేకములు విశేష పూజ హారతులు నిర్వహించారు. స్వర్గీయ దుర్గా గురు స్వామి ప్రియ శిష్యుడు ఆశి క్రిష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ విశేష పూజ కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు భద్రాచలం జగదీష్ స్వామి, ఆలయ సేవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**మందస, జూన్ 15(వార్త):** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తోందని కూటమి నాయకులు అన్నారు. మందస మండలంలోని దేశిబట్టి ఛానల్ లో వెంకటవరదరాజపురం, బిన్నల, హరిపురం, తాళ్ళబద్ర సాగునీటి కాలువల పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష సంకల్పంలో భాగంగా ఈ పనులు చేపట్టడం జరిగింది. ప్రతీ చేనుకు నీరు-ప్రతీ చేతికి పని లక్ష్యంగా పలాసలో గౌతు శిరీషా అడుగులు వేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతర ప్రజా పక్షపాతిగా పలాస నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆమె అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయానికి నీరందించి, రైతు ముఖంలో ఆనందం చూడటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని, ఈ పూడికతీత పనుల ద్వారా కాలువల చివరి ఆయకట్టు వరకు సాగునీరు సజావుగా అందుతుందని, తద్వారా పంటల దిగుబడి పెరిగి రైతాంగం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, క్లస్టర్ ఇంచార్జ్ కొర్ల కన్నారావు, మార్పు వెంకటేశ్, సునాముది సిస్టమ్ అధ్యక్షుడు గుంట నారాయణ, సింగుపురం పాపారావు, యెన్ని నారాయణ మూర్తి, ప్రధాన మన్మథరావు, మార్పు లక్ష్మణరావు, ఇతర ముఖ్య తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పడకేసిన పశు వైద్యం

**- వైసీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ ఆవేదన**

**- సోంపేట పశువైద్యశాల ఆకస్మిక పరిశీలన**



**సోంపేట, జూన్ 15(వార్త):** రైతాంగానికి ఎంతో వెన్నుదన్నుగా ఉండే పశువుల పెంపకం పట్ల,పశు వైద్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని దీనివల్ల ఎక్కడ చూసినా పశు వైద్యం పడకేసిందని ఇచ్చాపురం వైసిపి సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యం పట్ల కనీసం పట్టించుకోకపోవడం, అవసరమైన వైద్యులు నియామకం లేకపోవడం, మందులు సక్రమంగా అందక రైతులు తీవ్రంగా నష్టపోవడం, అత్యవసర సేవలు అందించే అంబులెన్సులు నాలుగు మండలాలకు ఒకటి మాత్రమే పనిచేయడం వంటి సమస్యలతో ఇచ్చాపురం నియోజకవర్గం లో పశు వైద్యం కునారిల్లిందని అన్నారు. కొంతమంది బాధిత రైతులు సమస్యలపై శ్యాం ప్రసాద్ రెడ్డి సోమవారం నేరుగా స్థానిక పశు వైద్య కేంద్రానికి వెళ్లి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం నాలుగు మండలాలకు ఒకే అధికారి ఆధ్వర్యంలో సేవలు అందడం బాధాకరమని అన్నారు. సోంపేటలో ఇన్చార్జి బాధ్యతలతో పశువైద్య కేంద్రం నడపడం దురదృష్టకరమని అన్నారు. వేల సంఖ్యలో ఆవులు,గేదెలు , మేకలు, గొర్రెలు వున్న ఈ మండలం లో ఇంత నిర్లక్ష్యం తగునా అంటూ ప్రశ్నించారు. ప్రతిరోజు పశువుల వైద్యం కోసం రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వైద్య సేవల కోసం నిరీక్షించడం తప్ప ప్రభుత్వ సేవలు అందే పరిస్థితి లేదని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో పశు వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చి రైతుల కళ్ళల్లో ఆనందం చూసినప్పటికీ కూటమి ప్రభుత్వంలో రైతుల కళ్ళల్లో కన్నీళ్లు చూడాల్సి వస్తుందని అన్నారు. వెంటనే ఇటువంటి పరిస్థితి మారాలని శ్యాంప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు రమేష్,బాలరాజు, ఢిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల స్వేచ్ఛను హరించే విధానాలను ఉపసంహరించుకోవాలి



**పలాస, జూన్ 15 (వార్త):** ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద, మాకనపల్లి గ్రామంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో ఏవో భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, నాయకులు మాట్లాడుతూ దేశంలో మహిళలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించేందుకు ఒబీసీ, మైనారిటీ మహిళలకు సబ్‌కోటాలతో సహా 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను విరమించుకోవాలని కోరారు. నిధుల కోతలు, పని దినాల తగ్గింపు, వేతనాల చెల్లింపుల జాప్యాలను నిలిపివేసి ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహిళలను పిల్లలను కనే యంత్రాలుగా చూపించే విధానాలు, ప్రకటనలు, ప్రోత్సాహకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఎంతమంది పిల్లలు కనాలనేది వారి వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కు అని పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలకు రూ.30,000, నలుగురు పిల్లలకు రూ.40,000 వంటి ప్రోత్సాహకాల ప్రకటనలు మహిళల స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. ఇటువంటి విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ, జిల్లా కమిటీ సభ్యులు లత, గీత, జానకి, హేమక్క, సావిత్రమ్మ, డిల్లమ్మ, ఇందిరా, జానకమ్మ పాల్గొన్నారు.

# సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** నరసన్నపేట మండలం దేవాది పాత జాతీయ రహదారి సమీపంలో ఉన్న సాగునీటి కాలువ మరియు శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టును సోమవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవాది గ్రామం నుంచి గోపాలపెంటకు వెళ్లే ప్రధాన కాలువ ఓల్డ్ ఎన్‌హెచ్-5 రహదారిని దాటే ప్రాంతంలో ఉన్న పాత కల్వర్టు దెబ్బతినడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కాలువ ద్వారా దేవాది, గోపాలపెంట, మాకివలస ప్రాంతాలకు చెందిన రైతులకు సాగునీరు అందుతుండగా, కల్వర్టు శిథిలావస్థ కారణంగా వ్యవసాయ అవసరాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. కల్వర్టు పునర్నిర్మాణం చేపట్టకపోతే సుమారు 600 నుంచి 700 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వెంటనే ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే మరమ్మతు పనులు పూర్తి చేసి కాలువలో నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమస్యను ఇప్పటికే పరిశీలించామని, త్వరలోనే సాంకేతిక నివేదిక సిద్ధం చేసి కల్వర్టు పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నరసన్నపేట మండల వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, కోమర్తి నీటి సంఘం అధ్యక్షుడు ముద్దాడ అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు ధర్మాన అసిరి నాయుడు, నీటి సంఘం టీసీలు పాలకొండ సూర్యనారాయణ, ముద్దాడ రాంబాబు, యాళ్ల సూర్యకాంతం, మడపాం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొద్దు సుందరరావు, గొరివిల్లి రఘునాథ్, దుంగ గంగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 'దువ్వాడ దెబ్బ'కు తలలు పట్టుకున్న టీడీపీ నేతలు

**పలాస, జూన్ 15 (వార్త):** జీడిపప్పుపై రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీతో పాటు అదనంగా ఒక శాతం మార్కెట్ సెస్ విధించడం పట్ల జీడి పరిశ్రమ భవిష్యత్తులో తీవ్ర సంక్షోభంలో పడబోతుందన్న ఆందోళన జీడి పరిశ్రమల యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి. 'ఒకే దేశం-ఒకే పన్ను' నినాదంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలు చేస్తుంటే, ఉద్దానం ప్రాంతానికి జీవనాడి అయిన పలాస జీడి పరిశ్రమపై మాత్రం 'జీఎస్టీకి తోడు సెస్', 'ఒకే సరుకుపై రెండు ఇ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్లు' అంటూ డబుల్ భారం మోపుతుండడంతో పరిశ్రమ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఈ ప్రాంతంలో చేసిన క్షేత్రస్థాయి పరిశోధనలో వెల్లడైంది. శ్రీకాకుళం జిల్లా పలాస, కాశీబుగ్గ, మందస, సోంపేట ప్రాంతాల్లో సుమారు 400కు పైగా చిన్న, మధ్య తరహా జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది కార్మికులు, రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం జీడి వ్యాపారులు రైతుల వద్ద నుంచి జీడిపిక్కలను కొనుగోలు చేసి పరిశ్రమలకు తరలించే సమయంలో వ్యవసాయ ఉత్పత్తిగా ఒకసారి ఆన్‌లైన్ ఇ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ తీసుకోవాలి. ఆ పిక్కలను ప్రాసెసింగ్ చేసి జీడిపప్పుగా మార్చిన తర్వాత అదే సరుకును మార్కెట్‌కు, ఎగుమతులకు తరలించేందుకు 'సెకండరీ సేల్స్' పేరుతో మళ్లీ రెండోసారి లింకేడ్ ఇ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ తప్పనిసరి చేశారు. రూపం మారినా సరుకు ఒక్కటే అయినప్పుడు రెండు సార్లు పర్మిట్ ఎందుకని, దీనివల్ల సమయం వృథాతో పాటు రవాణా ఖర్చులు, నిర్వహణ భారం రెట్టింపు అవుతోందని యజమానులు వాపోతున్నారు. ఇక పన్నుల విషయంలో అసలు వివాదం మొదలైంది. దేశమంతా జీఎస్టీ ఒకటే అమలవుతుండగా, పలాసలో మాత్రం జీడిపప్పుపై జీఎస్టీతో పాటు అదనంగా 1% మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నారు. పలాసకు కూతవేటు దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడి, గారబంద ప్రాంతాల్లో జీడి పరిశ్రమలకు జీఎస్టీ మినహా ఇతర సెస్‌లు, అదనపు పన్నులేమీ లేవు. దీంతో పలాస జీడిపప్పు ధర ఒడిశా సరుకుతో పోలిస్తే కిలోకు రూ.40 నుంచి రూ.50 వరకు అధికంగా ఉంటోంది. "సరిహద్దు దాటితే పన్ను లేదు, ఇక్కడెందుకు? ఈ వ్యత్యాసంతో జాతీయ మార్కెట్‌లో మేం పోటీ పడలేకపోతున్నాం. క్రమంగా బల్క్ ఆర్డర్లు ఒడిశాకు వెళ్లిపోతున్నాయి" అని పలాస జీడి పరిశ్రమల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ అన్యాయంపై వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత, పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. జీడిపప్పుపై మార్కెట్ సెస్ ఒక శాతం ఉపసంహరించాలని, డబుల్ పర్మిట్ విధానం రద్దు చేయాలని కోరుతూ ఆయన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రికి, ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖలు రాశారు. "లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఉద్దానం వెన్నెముక అయిన జీడి పరిశ్రమను కాపాడాలంటే అనవసర పన్ను భారాలు, నిబంధనలు తొలగించాలి. జీడిపిక్కల కొనుగోలు సమయంలో జారీ చేసిన పర్మిట్‌నే జీడిపప్పు రవాణాకు కూడా వర్తింపజేయాలి" అని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. జీడిపప్పుపై మార్కెట్ సెస్ ఒక శాతం ఉపసంహరించాలన్న దువ్వాడ శ్రీధర్ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా టీడీపీ నేతలు మౌనం వహించారు. దీంతో జీడి పరిశ్రమ యాజమాన్యాల నుంచి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. "సెస్ ఎత్తేయమని అడిగితే సమాధానం లేదు. పక్క రాష్ట్రంలో లేని సెస్ మనకెందుకు అంటే నోరు మెదపరు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు" అని యాజమాన్యాలు బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యతిరేకతతో అప్రమత్తమైన పలాస టీడీపీ పెద్దలు నష్ట నివారణ చర్యలకు దిగారు. 'దువ్వాడ దెబ్బ'కు ఇరుకునపడిన నేపథ్యంలో సమస్యను డైవర్షన్ చేసేందుకు పలాస జీడిపప్పుకు బ్రాండ్ అంబాసిడర్ కల్పిస్తామంటూ జీడి వ్యాపారులతో చర్చలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే గౌతు శిరీష భర్త వెంకన్న చౌదరి ఇటీవల పలాసలో జీడి వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. "అమెరికా వంటి దేశాలలో పలాస జీడిపప్పుకు అంతర్జాతీయ మార్కెట్ పెంచేందుకు బ్రాండ్ అంబాసిడర్‌ను తెప్పిస్తాం. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జీడి వ్యాపారులకు భేటీ ఏర్పాటు చేస్తాం. ఎగుమతి ఒప్పందాలు కుదిరేలా చూస్తాం" అని ఆయన వ్యాపారులకు హామీ ఇచ్చారు. దువ్వాడ శ్రీధర్ బాబా ఎఫెక్ట్ గట్టిగా తగలడంతో 'ప్లేటు మార్చి' పలాస జీడిపప్పుకు బ్రాండ్ అంబాసిడర్ తెప్పిస్తామంటూ ఎమ్మెల్యే వర్గీయులు చేస్తున్న హడావుడిపై జీడి పరిశ్రమ యజమానులు అంతర్గతంగా తీవ్రంగా చర్చించుకుంటున్నారు. "అసలు సమస్య 1% సెస్, డబుల్ పర్మిట్. వాటిని పరిష్కరించకుండా అమెరికా, అంబాసిడర్ కబుర్లు చెబితే ఎలా? ముందు పన్ను భారం తగ్గించండి, బ్రాండింగ్ తర్వాత. అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయొద్దు. మాకు కావాల్సింది ప్రచార ఆర్భాటాలు కాదు, ఉపశమనం" అని జీడి పరిశ్రమల సంఘం నేతలు తెగేసి చెబుతున్నారు. ఈ వివాదంపై పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు హడావుడిగా ప్రెస్‌మీట్ ఏర్పాటు




చేసి "కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీ యాక్ట్ ప్రకారమే 1% మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నాం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ తప్పేమీ లేదు" అని వివరణ ఇచ్చారు. కానీ 'పక్క రాష్ట్రంలో లేని సెస్ ఇక్కడెందుకు' అనే దువ్వాడ శ్రీధర్ బాబు ప్రధాన ప్రశ్నకు మాత్రం చైర్మన్ వద్ద సమాధానం లేదు. ఒకవైపు ఉత్పత్తి వ్యయం పెరగడం, మరోవైపు ఒడిశా నుంచి పోటీ ఎదురుకావడంతో పలాసలోని 400కు పైగా చిన్న, మధ్య తరహా జీడి పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. దీంతో వీటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, రైతుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి డబుల్ పర్మిట్ విధానం, అదనపు మార్కెట్ సెస్‌ను రద్దు చేసి పరిశ్రమకు ఊరట కల్పించాలని, లేని పక్షంలో రోడ్డెక్కి ఆందోళన బాట పడతామని జీడి పరిశ్రమ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. దువ్వాడ దెబ్బకు తలలు పట్టుకున్న టీడీపీ నేతలు బ్రాండ్ అంబాసిడర్ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, అసలు సమస్య పరిష్కారం కాకుండా ప్రచార ఆర్భాటాలు చేస్తే సహించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సమీరాకి ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం, జూన్ 15 (వార్త):** డొంకూరు గ్రామానికి చెందిన దున్న సమీరా బోన్ మరో కాన్సర్ వ్యాధి తో బాధపడుతున్నారు, రెండు కాళ్ళు పనిచేయక 88 శాతం వైకల్యం సర్టిఫికెట్ డాక్టర్స్ ఇచ్చారు కానీ ఆమెకు ప్రభుత్వం నుండి పెన్షన్ మంజూరుకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం నుండి పెన్షన్ మంజూరు అయ్యేంత వరకు ప్రతి నెల కూడా ఆమెకు వైద్య సహాయం కొరకు 2500 రూపాయలు ఆర్థిక సాయం నియోజకవర్గ వైస్సార్సీపీ సమనవ్య కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అందిస్తున్నారు. గతంలో ఆమె పెన్షన్ కొరకు జిల్లా కలెక్టర్ గారికి తెలియజేయటం జరిగిందని చెప్పారు. ఈ పాపకు ఈ మధ్య వెలువడిన 10 వ తరగతి ఫలితాలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందిన విషయం విధితమే. ఇందులో భాగంగా ఈ నెల కూడా ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్ల దేవరాజు ,బుడ్డ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# అద్దెలు కట్టకపోతే షాపులకే తాళాలు..!

**- మున్సిపల్ బకాయిదారులకు కమిషనర్ అల్టిమేటం**

**- రూ.50 లక్షల బకాయిల వసూళ్లపై కఠిన వైఖరి**

**- 18% జీఎస్టీతో బకాయిలు చెల్లించకపోతే సీజ్ చర్యలు తప్పవన్న హెచ్చరిక**

**పలాస, జూన్ 15 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అద్దెలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న ఐడీఎస్ఎంటీ ( ఐడిఎస్ టి) షాపుల లీజుదారులపై మున్సిపల్ యంత్రాంగం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దెలను ఎగ్గొడుతూ, షాపులను ఇతరులకు అధిక అద్దెలకు ఇచ్చి లాభాలు పొందుతున్న కొందరు లీజుదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఐ. శ్రీనివాసులు స్పష్టం చేశారు. అవసరమైతే బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఐడీఎస్ఎంటీ షాపుల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. మున్సిపాలిటీకి రావాల్సిన అద్దెలు భారీగా బకాయిపడటం వల్ల ప్రజా సేవల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ వ్యయాలపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెల 6వ తేదీలోపు అద్దెల వసూళ్లు పూర్తి చేసేలా సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇతరులకు అద్దెకు ఇచ్చి.. మున్సిపాలిటీకి బకాయిలా.., కొంతమంది లీజుదారులు మున్సిపల్ షాపులను మూడో వ్యక్తులకు అద్దెకు ఇచ్చి భారీ మొత్తాలు వసూలు చేసుకుంటున్నప్పటికీ, మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దెల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ఆస్తులను వినియోగించుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని దెబ్బతీయడం సరికాదని స్పష్టం చేశారు.

### రూ.50 లక్షలకు చేరిన బకాయిలు..

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని షాపుల అద్దె బకాయిలు ఇప్పటికే సుమారు రూ.50 లక్షల వరకు పేరుకుపోయినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ పరిస్థితి కొనసాగితే మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించని లీజుదారులపై నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు షాపులను సీజ్ చేసే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.



### లీజుదారుల వాదన ఇదే...

ఈ సందర్భంగా షాపుల నిర్వాహకులు ఎస్. రవి, బి. శంకరరావు, ఎ.ఎన్. కుమార్, కె. శంకరరావు, ఎ.ఎన్. నాగేశ్వరరావు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ షాపుల అద్దెలను ఒక్కసారిగా భారీగా పెంచడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. కోర్టు తీర్పు వెలువడే వరకు పాత విధానం ప్రకారమే అద్దెలు చెల్లించాలని అప్పటి కమిషనర్ రాజగోపాల్ సూచించారని తెలిపారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ రాజగోపాల్ ఆదేశాల మేరకు పాత విధానంలోనే అద్దెలు చెల్లిస్తూ వస్తున్నామని, ఒకేసారి భారీ మొత్తాలు చెల్లించడం తమకు భారంగా మారుతోందని పేర్కొన్నారు. బకాయిలు లేకుండా చెల్లింపులు చేసే దిశగా సహకరిస్తామని, మున్సిపాలిటీ అధికారులు కూడా తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు.

### గురువారం తేలనున్న భవితవ్యం

రానున్న గురువారం అన్ని షాపుల లీజుదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ విధానాలు, నిబంధనలను వివరించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆ సమావేశం అనంతరం కూడా బకాయిలను 18 శాతం జీఎస్టీతో సహా చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు షాపులను సీజ్ చేస్తామని తేల్చిచెప్పారు. మున్సిపల్ ఆదాయ వనరుల పరిరక్షణలో భాగంగా బకాయిల వసూళ్లపై ఇకపై ఎలాంటి రాజీ ఉండదని, ప్రజా ధనాన్ని కాపాడటంలో కఠినంగా వ్యవహరిస్తామని కమిషనర్ హెచ్చరించడంతో మున్సిపల్ షాపుల లీజుదారుల్లో ఆందోళన నెలకొంది.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** విద్యార్థులు ఇటీవలి కాలంలో మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని శక్తి యాప్ బృందం సభ్యులు గిరిధర్, భీమారావు, విజయలక్ష్మి సూచించారు. సోమవారం నరసన్నపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం అలవాటు పడిన వారు భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1972 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శక్తి యాప్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## చేపల మార్కెట్ పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** నరసన్నపేట చేపల మార్కెట్ పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. మార్కెట్ ప్రాంతంలో చేపల వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు, కుళ్లిపోయిన కూరగాయలు, ఇతర చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. మార్కెట్‌లో ప్రతిరోజూ వందలాది మంది వ్యాపారులు, వినియోగదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చేపల వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల భరించలేని దుర్గంధం వ్యాపిస్తోందని చెబుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వ్యాధుల ప్రబలే ప్రమాదం మరింత పెరుగుతుందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మార్కెట్ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని, చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్, క్రిమిసంహారక మందుల పిచికారీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు అధికంగా సందర్శించే ప్రాంతం కావడంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, వ్యాపారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## పోలీస్ సిబ్బందికి యోగా శిక్షణ



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ శాఖ సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, పోలీస్ విధుల్లో భాగంగా సిబ్బంది తరచూ మానసిక ఒత్తిడి, పని భారం ఎదుర్కొంటుంటారని అన్నారు. అలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఏకాగ్రత, సహనం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు విధుల నిర్వహణలో మరింత సమర్థత సాధించవచ్చని వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఒక ఉత్తమ మార్గమని తెలిపారు. యోగా శిక్షణలో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి వివిధ ఆసనాలు, శ్వాస వ్యాయామాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

## నక్క రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన బగ్గు అర్చన

**జలుమూరు, జూన్ 15 (వార్త):** జలుమూరు మండలం అక్కురాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, యూనిట్ ఇన్‌చార్జి నక్క రమేష్ కుటుంబ సభ్యులను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో నక్క రమేష్ తల్లిదండ్రులు మృతి చెందిన విషయం తెలుసుకున్న బగ్గు అర్చన సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆమె, తల్లిదండ్రుల మృతి తీరని లోటని పేర్కొంటూ ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు పలువురు పార్టీ నాయకులు సైతం సానుభూతి తెలియజేశారు. గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు కూడా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వెలమల రాజేంద్ర, దుంగ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

**పలాస, జూన్ 15(వార్త):** అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని జెఎల్ఎంసి కన్వీనర్ మధుబాబు కోరారు. సోమవారం పలాస--కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో అమలవుతున్న ప్రధానమంత్రి స్వానిధి పథకం స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర సమీక్ష సమావేశ నిర్వహించారు. మందిరంలో లోక కళ్యాణ మేళా నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకుల శాఖాధికారులతో జెఎల్ఎంసి కన్వీనర్ మధుబాబు, ఎఫ్ఏఎస్ఎస్ఐ ఇన్స్పెక్టర్ రామారావు మాట్లాడుతూ పిఎం స్వానిధి పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, అర్హులైన వీధి వ్యాపారులకు రుణాల మంజూరు, రుణాల తిరిగి చెల్లింపుల ప్రగతి, ద్వితీయ, తృతీయ విడత రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, రుణ పంపిణీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మావేశంలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించబడింది. రుణాల చెల్లింపులలో క్రమశిక్షణ పాటించే లబ్ధిదారులకు తదుపరి విడత రుణాల మంజూరులో ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారత కోసం బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని, సంఘాలకు అవసరమైన రుణ సదుపాయాలను అందించేందుకు బ్యాంకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. ఈ సందర్భంగా పలాస--కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని అర్హులైన వీధి వ్యాపారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవడానికి, రుణ, సబ్సిడీ లబ్ధులను పొందేలా సహాయ కార్యక్రమాలు నిర్వహించాల్సిన డిమాండుతో పాటుగా శిక్షణ కార్యక్రమాలు కోరారు. ఇప్పుడు ఉన్న మైక్రో ఫైనాన్స్, మోడ్రన్ మార్కెటింగ్ అవకాశాలను ఉపయోగించి చిన్న వ్యాపారాల స్థాయి పెంచుకోవచ్చునని, పథకాల గురించి పూర్తి సమాచారం, దరఖాస్తు ప్రక్రియలు, అవసరమైన డాక్యుమెంటేషన్‌పై తక్షణ సహాయం అవసరం.” పురపాలక సంఘం అధికారులు స్వయంగా విజ్ఞప్తిని పరిశీలిస్తామని, అప్రమత్తతను పెంచేందుకు స్థానిక కేంద్రాల్లో పథకాల గురించిన అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయ చర్యలు సూచించారు. ఈ సమావేశంలో మెప్మా సీఎంఎంఏ మోహన్ రావు,ఐబీ రామారావు, డీఈఓ విజయ్ కుమార్, సి.ఎల్.ఆర్.పిలు కవిత, సంధ్య , తులసి, పద్మ, ఇతర సిబ్బంది, ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ సోషల్ మీడియాపై ఆంక్షలు సరికావు



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** రాష్ట్రంలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. సోమవారం నరసన్నపేటలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వం అధికార యంత్రాంగం ద్వారా అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందని, ఆ హక్కులను హరించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై లక్ష్యంగా చర్యలు తీసుకోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులు, వారిపై జరుగుతున్న చర్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను సహించబోమని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ధర్మాన కృష్ణదాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళ హంతకులను కఠినంగా శిక్షించాలి



**మందస, జూన్ 15(వార్త):** మన్యం జిల్లా పాలకొండ మండలం తామరాడ పంచాయతీ పరిధిలో బర్మాసీతంపేటకు చెందిన గిరిజన మహిళ బిడ్డక ఉషారాణి(32)ని హత్య చేసిన వ్యక్తులకు చట్టపరంగా కఠినమైన శిక్ష వేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం ఎస్టీ విభాగం అధ్యక్షుడు సవర నీలకంఠం(బిట్టుబాబు) డిమాండ్ చేశారు. మందసలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టిన తర్వాత మహిళలకు రక్షణకు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి పగాడ సంతాపం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి రోజు ఏదో ఒకచోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్నాయన్నారు, గతంలో ఎన్నడు లేని విధంగా గిరిజన యువతి అత్యంత దారుణంగా హత్యకు గురవ్వడం అమానుషమన్నారు. కొన్ని కథనాలు ప్రకారం ఆ ప్రాంతానికి సంబంధించిన ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన ఇద్దరు యువకులు ఆమెపై లైంగికంగా దాడి చేసి, కాలు చేతులు వెనక్కి విరిచి తాళ్లతో కట్టి చెరువులో తోసేయడం జరిగిందన్న కథనాలు తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎటువంటి ఇంటరాగేషన్ చేయకపోవడం చాలా బాధాకరమన్నారు, ఈ ప్రభుత్వం మహిళలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించకపోవటంతో ఈ తరహా ఘటనలు తరచూ జరుగుతున్నాయన్నారు, ఉషారాణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

## విజయోత్సవ సభను విజయవంతం చేయాలి



**మందస, జూన్ 15(వార్త):** కూటమి పాలన-రెండేళ్ల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన కోరారు. మందస మండలంలోని హరిపురంలో సోమవారం దుర్యోధన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 16న(మంగళవారం) ఉదయం 9గంటలకు పలాసలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పాలన-రెండేళ్ల విజయోత్సవ సభ నిర్వహించబడుతుందన్నారు. పలాస నియోజకవర్గంలో ప్రజా రంజక పాలనకు రెండు వసంతాలు నిండిన సందర్భంగా పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు.. మందస మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి పాలన-రెండేళ్ల విజయోత్సవ సభ, ప్రజాసేవకు పునరంకితమయ్యే మహోత్తర కార్యక్రమం ఏర్పాటు చేయబడిందన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, అభిమానులు ఈ విజయ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన పిలుపునిచ్చారు.

## రైల్వే అండర్ పాసేజ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తాం



**ఇచ్ఛాపురం జూన్ 15 (వార్త):** ఇచ్ఛాపురం ఎం.తో టూరు ఎల్ సి గేటు వద్ద మరియు పాతలేశ్వ ర గుడికి వెళ్ళే దారిలో సుమారు 90కొట్ల రూపాయలు తో మంజూరు అయినట్లు జెడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస్ రౌలో చెప్పారు. అర్ వో బి ఉత్తర వైపు 626/02 వద్ద అర్ యు బి 2.60 కోట్ల రూపాయలు తో దక్షిణ వైపు 627/36, 38 వద్ద 3.19 కోట్ల తో ఆర్ యు బి లు మంజూరు అయి టెండర్ లు పూర్తి అయి ఉన్నాయని, సదరు కొత్తగా విశాఖపట్నం జోన్ ఏర్పడటం వలన మంజూరు అయిన ఫండ్ ఈస్ట్ కోస్ట్ జోన్ నుండి సౌత్ కోస్ట్ జోన్ కు ట్రాన్స్ఫర్ జరిగిందని అలాగే ఖుర్ద డివిజన్ లో వున్నా ఇంజనీరింగ్ స్టాఫ్ నుండి వర్క్ ఛార్జ్ వైజాగ్ డివిజన్ ఇంజనీరింగ్ స్టాఫ్ కు బదిలీ అవ్వడం వలన మరియు సిగ్నల్ కేబుల్ మార్చడం వలన పనిలో జాప్యం జరుగుతుందని అన్నారు.అలాగే రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వలన వీకేపేట స్టేట్ బ్యాంకు రోడ్ లో ప్రజల ఆస్తులు వ్యాపారు ల దుకాణాలు నష్ట పోకుండా స్థానిక శాసన సభ్యులు విప్ అశోక్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ చంద్ర మోహన్ నాయక్ దృష్టికి తీసుకుని వెళ్లి ఎవరికీ నష్టం లేకుండ ఫీల్డ్ సర్వే జరిపి అలెన్మెంట్ మార్చమని చెప్పారని అన్నారు. అంతే తప్ప కొంత మంది ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు రక్షించడానికి అలన్మెంట్ మార్చడం జరగలేదని అన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ జిల్లా కి ఈ ప్రాంతానికి సుమారు 56 రైల్వే బ్రిడ్జి ల నిర్మాణం కోసం 3500 కొట్లు మంజూరు చేయించారని అన్నారు. అలాగే అమృతభరత్ పథకం క్రింద ఇఛ్ఛాపురం స్టేషన్ లో 19కోట్లు తో ఆధునికరణ పనులు చేయించారని చెప్పారు. అలాగే పూరి అహమాదాబాద్ ట్రైన్ హాల్ట్ మూడు వీక్లీ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ హాల్ట్ లు చేసి ఈ ప్రాంత రైల్వే స్టేషన్ లు అభివృద్ధి పై చిత్త శుద్ధి తో పని చేస్తున్నారని అన్నారు.పై పనుల పై ఎవరు ఆందోళన చెందవసిన అవసరం లేదని తెలియ జేశారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రారంభం

**నరసన్నపేట, జూన్ 15(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట పట్టణంలోని నేతాజీ వీధిలో 136వ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటరు జాబితాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి కొత్తగా ఓటర్లుగా నమోదు కావాల్సిన వారు, వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు, తప్పులు ఉన్నవారు నిర్దేశిత ఫారాలను పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ రామకృష్ణ మాట్లాడుతూ, ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని ప్రజలకు వివరించారు. ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియలో ప్రజలు సహకరించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టిబాబు, స్థానిక ప్రజలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# కలెక్టర్ గారూ.. కరుణించండి!

**సోంపేట, జూన్15 (వార్త):** మండలంలోని ఎర్రముక్కాం నుండి రాణిగాం వరకు పూర్తిగా దెబ్బతిన్న తారు రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ ప్రముఖ సామాజికవేత్త, 'వే టు సక్సెస్' వ్యవస్థాపకులు దామోదర్ రావు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సుమారు 4 కిలోమీటర్ల పొడవున్న ఈ తారు రోడ్డు తీవ్రంగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలతో అధ్వాన్నంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని కలెక్టర్ స్వప్నికల్ దినకర్ దృష్టికి దామోదర్ తీసుకెళ్లారు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా, ఈ మార్గంలో నూతన రోడ్డు నిర్మాణాన్ని (రీ-టారింగ్) త్వరితగతిన చేపట్టాలన్న వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రోడ్డు పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌కు సుమారు 16 గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



## అల్లాడ ఎంపీటీసీ మొజ్జాడ అరుణమ్మ మృతి




**జలుమూరు, జూన్ 15(వార్త):** జలుమూరు మండలం అల్లాడ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు మొజ్జాడ అరుణమ్మ (45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అరుణమ్మకు ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం స్వగ్రామానికి తరలించగా, స్వగృహంలోనే ఆమె తుదిశ్వాస విడిచినట్లు భర్త భాస్కర్‌రావు తెలిపారు. అరుణమ్మ ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అల్లాడ గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. ఎంపీటీసీ సభ్యురాలిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసిన ఆమె మరణం స్థానిక ప్రజలకు తీరని లోటని గ్రామస్తులు పేర్కొన్నారు. అరుణమ్మ మృతిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అంతిమయాత్రకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. ఆమె మరణంతో అల్లాడ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## పిడుగు పడి 12 గొర్రెల మృతి



**జలుమూరు, జూన్ 15(వార్త):** జలుమూరు మండలం నగరికటకం గ్రామంలో పిడుగు పడి 12 గొర్రెలు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ సంఘటనతో గొర్రెల యజమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. గ్రామానికి చెందిన వనమా బారికవాడు, నాసారి లక్ష్మణరావు, డొక్కరి సింహాచలం తమ గొర్రెలను మేత కోసం సమీప ప్రాంతాలకు తీసుకువెళ్లారు. సాయంత్రం సమయంలో గొర్రెలను తిరిగి గ్రామానికి తీసుకువస్తుండగా ఆకస్మికంగా వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో మొత్తం 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలు మృతి చెందిన విషయం తెలుసుకున్న యజమానులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జీవనాధారంగా ఉన్న గొర్రెలను కోల్పోవడంతో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్థానికులు సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టపోయిన గొర్రెల యజమానులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. సంబంధిత అధికారులు ఘటనను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. వేసవి అనంతరం వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఈగల్ టీం సభ్యులు ఉదయ్ కుమార్ తెలిపారు. సోమవారం చేపట్టిన ఈ తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు, మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, మాదకద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా రవాణా కేంద్రాలు, కళాశాలల పరిసర ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, వాటి వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, అవగాహన కార్యక్రమాలతో పాటు తనిఖీలను మరింత ముమ్మరం చేస్తున్నామని ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఈగల్ టీం సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్న కరగాంలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు



**నరసన్నపేట, జూన్ 15(వార్త):** నరసన్నపేట మండలం చిన్న కరగాం గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి గ్రామస్థులు ఈ సమస్యను తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా గ్రామస్థులు, యువకులు మాట్లాడుతూ గ్రామంలో పిల్లలు, యువత క్రీడలు ఆడుకునేందుకు సరైన మైదానం లేదని వివరించారు. క్రీడా మైదానం లేకపోవడంతో యువతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రామంలో ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన సూచనల మేరకు శుక్రవారం సర్వేయర్ రామచంద్రరావు, వీఆర్వో పైడియ్య గ్రామంలో పర్యటించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. సుమారు ఎకరా భూమిలో క్రీడా మైదానం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. స్థలానికి సంబంధించిన వివరాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడా మైదానం ఏర్పాటు అయితే గ్రామ యువతకు క్రీడా ప్రోత్సాహం లభించడంతో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే మైదానం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వారపు సంతలో అక్రమ పశువుల రవాణాపై ఆందోళన



**జలుమూరు, జూన్ 15(వార్త):** కోటబొమ్మాళి మండలం నారాయణవలసలో ప్రతి గురువారం జరిగే వారపు సంతలో పశువులను అక్రమంగా చుట్టుపకల మండలాలు అయిన జలుమురు, సరవకోట నుండి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్థానిక ప్రజలు, పశు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సంతలో కొనుగోలు, విక్రయాల పేరుతో తరలిస్తున్న పశువుల రవాణాలో నిబంధనలు పాటించడం లేదని, మూగజీవాలను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమంగా తరలిస్తున్న ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పశువులను అధిక సంఖ్యలో వాహనాల్లో ఎక్కించడం, తగిన సౌకర్యాలు కల్పించకపోవడం వంటి అంశాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూగజీవాల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పశువుల రవాణాలో చట్టబద్ధమైన నిబంధనలు అమలు అవుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. నారాయణవలస వారపు సంతలో తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పశువుల రక్షణతో పాటు వాటి సంక్షేమానికి భంగం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తున్నారు. మూగజీవాల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# రైల్వే అండర్ పాసేజీలు.. ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు పూర్తి చేయండి

### - వైస్సార్సీపీ నేతల అల్టిమేటం



**ఇచ్ఛాపురం జూన్ 15 (వార్త):** ఇచ్ఛాపురం నుంచి తోట వీధికి వెళ్లే మార్గంలో గల లెవెల్ క్రాసింగ్ గేట్ గేట్ నెంబర్ 329 వద్ద, ప్రతీ 15 నిముషాలకు గేట్ క్లోజ్ అవ్వడం వలన నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుమారు 35-40 గ్రామాల ప్రజలు ప్రతీ రోజు విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కొరకు ఇచ్ఛాపురం పట్టణానికి రాకపోకలు సాగిస్తున్నారని వైస్సార్సీపీ నాయకులు అన్నారు. ఎం తోటూరు రైల్వే గేటు వద్ద రైల్వే అండర్ పాసేజి సమస్యలు పరిశీలించారు. ఈ గేట్ వద్ద రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ,డిపార్ట్మెంట్ అఫ్ రైల్వే వ తీసుకున్న నిర్ణయం దేశావ్యాప్తంగా గోల్డెన్ క్వార్డ్రిలెటరల్ హై డేన్సిటీ రైల్ నెట్వర్క్ లో భాగంగా ఢిల్లీ, ముంబై, హౌరా, చెన్నై పట్టణాలను కలిపే మార్గంలో మాన్ ఆపరేటెడ్ రైలు గేట్ లను తొలగించి వాటి స్థానంలో అర్ వో బి లేదా అర్ యు బి నిర్మాణం చేపట్టాలనే ప్రాజెక్ట్ లో భాగంగా ఇచ్ఛాపురం నార్త్ కేబిన్ వద్ద గేట్ నెంబర్ 329 స్థానంలో నిర్మాణం కొరకు రైల్వే డెవిజినల్ ఇంజనీర్ ఖుర్ధా అధికారులు కు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ తీర్మాణం 2022 సెప్టెంబర్ లోనే పంపగా సదరు ప్రాజెక్ట్ 2023 లోనే శాంక్షన్ పొందినది అని అన్నారు. తదుపరి సాంకేతిక సమస్యలు అధిగమించి నిర్మాణం స్టేజిలో ఉండేదని అన్నారు. ఐతే తదుపరి రాష్టంలో ప్రభుత్వం మారడం వలన అలిన్మెంట్ ప్లాన్ ఒకటికి రెండు సార్లు మార్పులు చేయడం అనేక అనుమానాలకు కారణమయ్యింది, కొద్ది మంది వ్యక్తుల ఆస్తులు వ్యక్తిగత రక్షణ చేయడానికి అలిన్మెంట్ ప్లాన్ మార్చారా? ప్లాన్ మార్చడం వలన ప్రభుత్వానికి అదనపు ఖర్చు జరిగిన పర్లేద? లేకపోతే నార్త్ గేట్ సమీపంలో కేవలం అండర్ పాసేజ్ నిర్మాణం చేసి ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి బ్రేకులు పడినట్టేనా ?? అని ప్రశ్నించారు. సదరు నార్త్ గేట్ వద్ద అండర్ పాసేజ్ నిర్మాణం చేస్తే అది చిన్న వాహనాల ప్రయాణానికి ఉపయోగపడుతుంది కానీ మార్కెట్ నుండి కొలిగాం మార్గం లోని ఇరుకు రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కాబోదని అన్నారు. అందువలన నార్త్ గేట్ వద్ద అండర్ పాసేజ్ నిర్మాణం తో పాటు నిర్మాణం ఇచ్ఛాపురం మెయిన్ రోడ్డులో రాజా వారి కోటకు ముందు నుండి మొదలుపెట్టి రైలు ట్రాక్ దాటించి పట్టాలకు సమానంతరంగా కొనసాగించి చిదంబర ఆలయం వద్ద రత్తకన్న రోడ్డు కు కనెక్ట్ చేయగలిగితే కొలిగాం రోడ్డు మార్గం ట్రాఫిక్ సమస్య తీరుతుందని అన్నారు. అదేవిదంగా సౌత్ గేట్ దాటాక జగనన్న కాలని కు వెళ్లే మార్గంలో ఇంకో అండర్ పాసేజ్ నిర్మాణం ఖచ్చితంగా చేపట్ట గలిగితే పెరుగుతున్న పట్టణ జనాభా మరియు ట్రాఫిక్ అవసరాలకు ఒక మెరుగైన పరిష్కారం కాగలదని అన్నారు.

1)నార్త్ గేట్ వద్ద అండర్ పాసేజ్ .

2)సౌత్ గేట్ వద్ద జగనన్న కాలనీ మార్గంలో అండర్ పాసేజ్.

3)మెయిన్ రోడ్డులో రాజ వారి కోట ముందు నుండి ప్రజల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా చేపట్టాలని వైస్సార్సీపీ తరుపున తెలియజేసినట్లు తెలిపారు. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం జరిగే ఇటువంటి ప్రాజెక్ట్ లను ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జిల్లాకు చెందిన ఎంపీ నిజంగా ఇచ్ఛాపురం ప్రజలపై కన్సర్న్ ఉంటే చిత్తశుద్ధిగా ప్రయత్నం చేస్తారా లేకపోతే మాటల మంత్రి గానే మిగిలిపోతారా చూద్దాం.అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమం లో ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, క్రిస్టియన్ విభాగం ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, డి అర్ యు సి సి సభ్యులు కట్టా సూర్యప్రకాష్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు ఉలాల భారతీ దివ్య, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సాలిన గాంధీ, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, డీసీఎంస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, ఎంపీటీసీ నీలాపు జగదీశ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షులు కాళ్ళ సత్యం జిల్లా పార్టీ కార్యదర్శులు ఆశి పురుషోత్తం రెడ్డి, ఇసురు పరశురామ్ రెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి కాళ్ళ మదన్,జిల్లా మహిళా నాయకురాలు మద్ది హిమాశైలజ రెడ్డి,మాజీ కౌన్సిలర్ లు, బచ్చు జగన్, చాట్ల తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ లు గుజ్జు ఢిల్లీరావు రెడ్డి, మద్ది దుర్యోధన రెడ్డి, పార్టీ నాయకులు కాళ్ళ నారాయణ, కాళ్ళ దేవరాజు, తిప్పన కృష్ణారెడ్డి, సాడి జయరాం రెడ్డి,,వడ్డిన తేజ రెడ్డి, వడ్డిన రమేష్, బదకల భాస్కరరావు, సఫీ,కాళ్ళ తేజ, బోరుపద్ర పాపయ్య, వడ్డిన మురళి, పాతిర్ల వెంకటేష్, పాతిర్ల జగదీశ్, ఆశి శ్రీను, దక్కత శ్రీరాములు, జుత్తు మోహన్ రావు, ధర్మ, మహేంద్ర పలువురు యువకులు, పార్టీ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



**జలుమూరు, జూన్ 15 (వార్త):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అన్నారు. జలుమూరు మండలం తిలారు ఆర్ఎస్‌లో రాగోలు జేమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు మెగా వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమై, పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను తీసుకురావడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ఆరోగ్య రంగానికి ఎంతో ఉపయోగకరమని కొనియాడారు. భవిష్యత్తులోనూ నియోజకవర్గంలోని మరిన్ని గ్రామాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేలా తమ వంతు సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం వైద్య శిబిరానికి విచ్చేసిన రోగులను స్వయంగా పరామర్శించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, చల్లవానిపేట పీఏసీఎస్ ఛైర్మన్ దుంగ స్వామిబాబు, యూనిట్ ఇన్‌చార్జి గుండ రామకృష్ణ, మాజీ సర్పంచ్ బత్తుల రాజు, గొల్లంగి సత్యనారాయణ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి గొలివి బాలకృష్ణ, వైద్యులు, వైద్య సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, జూన్ 15(వార్త):** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం టెక్కలిపట్నంలో రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. పలాస మండలం టెక్కలిపట్నంలో రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత పాలకులు రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ముఖ్యంగా వంశధార జలాలను రైతులకు సమర్థవంతంగా అందించలేకపోయారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, రైతులు అవసరానికి మించి ఎరువులు వినియోగించవద్దని సూచించారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి సారవంతత తగ్గిపోతుందని, దిగుబడులపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. ముఖ్యంగా యూరియాను ఎకరాకు 75 కిలోల మోతాదులో మాత్రమే వినియోగించాలని వ్యవసాయ శాఖ సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని కోరారు. భవిష్యత్ తరాల కోసం భూమి ఆరోగ్యాన్ని కాపాడాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాలు మరియు ఇతర వ్యవసాయ సదుపాయాలను పొందేందుకు రైతులు తప్పనిసరిగా ప్రభుత్వ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ ద్వారా రైతులకు పారదర్శకంగా సబ్సిడీ ప్రయోజనాలు అందుతాయని వివరించారు. రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీను, పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు వంకల కుర్మారావు, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, రైతులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం




**నరసన్నపేట, జూన్ 15(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన తెలిపారు. శుక్రవారం నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బగ్గు అర్చన దృష్టికి తీసుకువచ్చారు. తరగతి గదుల్లో సరిపడా ఫర్నిచర్ లేకపోవడం వల్ల విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం పడుతోందని వివరించారు. సమస్యను విన్న బగ్గు అర్చన స్పందిస్తూ, విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు సాధ్యమైనంత మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-1ల నియామకం

### -ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నియామక పత్రాల అందజేత

### - శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**శ్రీకాకుళం, జూన్ 15(వార్త):** ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై. ఎస్. షర్మిల రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి బూత్ లెవల్ ఏజెంట్-1 (బీఎల్ఏ-1)లను నియమించినట్లు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపాల అన్నాజీ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు బీఎల్ఏ-1లుగా ఎంపికైన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, పలాస నియోజకవర్గానికి బద్రి సీతమ్మ, టెక్కలి నియోజకవర్గానికి కోత మధుసూదన్ రావు, నరసన్నపేట నియోజకవర్గానికి మంత్రి నరసింహమూర్తి, పాతపట్నం నియోజకవర్గానికి చోడవరం సంధ్యారాణి, శ్రీకాకుళం నియోజకవర్గానికి అంబటి కృష్ణారావు, ఆమదాలవలస నియోజకవర్గానికి సనపల అన్నాజీరావు, ఎచ్చెర్ల నియోజకవర్గానికి కరిమజ్జి మల్లేశ్వరరావును బీఎల్ఏ-1లుగా నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితాల పరిశీలన, ఎన్నికల ప్రక్రియలో పార్టీ తరఫున సమన్వయం, క్షేత్రస్థాయి పార్టీ బలోపేతానికి బీఎల్ఏ-1లు కీలకంగా వ్యవహరించనున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, మామిడి సత్యనారాయణ, దేశెళ్ల గోవింద, మల్లిబాబు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546